సచివాలయాలు..సేవాలయాలు

ఏ అవసరం వచ్చినా మండల కేంద్రానికి పరుగులు తీసే రోజులు పోయాయి. కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగే బాధలకు చెల్లు చీటి పడింది. ఏ సమస్యకైనా సచివాలయాలే పరిష్కారం చూపుతూ సేవాలయాలుగా వెలుగొందుతున్నాయి. మరిన్ని సేవలనందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాయి.

- గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కారం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గడివేముల: ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ సులభంగా చేరాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు అన్ని వర్గాల ప్రశంసలు అందుకుంటున్నాయి. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేపట్టి ఎన్నో సమస్యలు కళ్లారా చూశారు. ప్రభుత్వ పథకాలు అందాలంటే పేదలు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. జన్మభూమి కమిటీల చేతులు తడపందే సంక్షేమ ఫలాలు అందవని తెలిసి నిర్ఘాంతపోయారు. ఎలాగైనా పాలనను ప్రజల వద్దకే చేర్చాలని సంకల్పించారు. అధికారంలోకి వచ్చిందే తడవుగా సచివాలయాల వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. మండలంలో 14 సచివాలయాలు ఉన్నాయి. అందులో ఒక్కో సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించారు. వారి ద్వారా పాలనను ప్రజల ముంగిటకే చేర్చుతున్నారు. ప్రతి సచివాలయంలో ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు 540 సేవలు అందిస్తున్నారు. అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకం ఇంటి వద్దకే తీసుకువస్తున్న సచివాలయాలపై ప్రజలకు నమ్మకం ఏర్పడింది. దళారీ వ్యవస్థ లేకుండా సమస్యలకు సులభంగా పరిష్కారాలు లభిస్తుండటంతో అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కొరటమద్ది సచివాలయం

పింఛన్ మంజూరు చేశారు



గతంలో మాదిరిగా పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగలేదు. వలంటీర్‌కు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్సు ఇచ్చాను. వలంటీరు సచివాలయంలో దరఖాస్తు చేయించాడు. కొన్ని రోజులకు నాకు వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. ఈ రోజు రూ.2,750 సొమ్ము అందుకుంటున్నాను. పింఛన్ సొమ్ము మా కుటుంబానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు. – చాకలి వెంకటేశ్వర్లు, వృద్ధాప్య పింఛన్‌దారుడు, గడివేముల

నిమిషంలో అడంగల్



గతంలో 1బీ, అడంగల్ కోసం ఎక్కువ ఖర్చు అయ్యేది. గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. సచివాలయాలు వచ్చిన తరువాత రైతులకు అవసరమైన సేవలు త్వరితగతిన తక్కువ ఖర్చుతో పూర్తవుతున్నాయి. సచివాలయాలలో సులభంగా, అవినీతి రహితంగా పనులు జరుగుతున్నాయి. గాంధీజీ కలలుకన్న స్వరాజ్యం సాకారం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది.
– శేషాద్రిగౌడ్, రైతు, గడివేముల

ఎంతో సంతృప్తిని ఇస్తోంది



గ్రామాల్లోనే ప్రతిఒక్కరికి లబ్ధిచేకూర్చాలనే ఉద్దేశంతో సచివాలయాలను తీసుకువచ్చారు. పేదలకు సేవచేయడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. వలంటీరు వ్యవస్థతో ఇంటిముందుకే సంక్షేమపథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. లబ్ధిదారుడు కార్యాలయాలకు రాకుండానే పనులు పూర్తి చేస్తున్నాం. కేవలం జిరాక్సు కాపీలు వలంటీర్ల ద్వారా పంపిస్తే అర్హత ఉంటే ప్రభుత్వ సంక్షేమపథకాలు మంజూరు చేస్తున్నాం. పేదలకు సేవ చేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది.
– రంగడు, పంచాయతీ కార్యదర్శి, గడివేముల సచివాలయం

క్లుప్తంగా

శాంతిరాం విద్యార్థిని ప్రతిభ

పాణ్యం: తమ కళాశాల ఈఈఈ మూడో ఏడాది విద్యార్థిని హర్షిత చదరంగంలో ప్రతిభ కనబరిచిందని శాంతిరాం ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఈఈఈ విభాగ అధిపతి మల్లికార్జున, పీడీ చంద్రారెడ్డితో కలిసి ఆయన విద్యార్థినిని అభినందించారు. ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు కడపలోని కేఎస్ఆర్ఎం కళాశాలలో నిర్వహించిన చదరంగం పోటీల్లో హర్షిత మొదటి బహుమతి సాధించడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు.

కేసీకి నీటి విడుదల నిలిపివేత

గూడూరు: సుంకేసుల డ్యామ్‌కు ఇన్ ఫ్లో నిలిచిపోవడంతో శనివారం కేసీ కాల్వకు నీటి విడుదలను అధికారులు నిలిపేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.751 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు

పాణ్యం: మాద్దూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు డాక్టర్ సూచించారు.

వానరానికి అంత్యక్రియలు

సి.బెళగల్: అనారోగ్యంతో మృతిచెందిన వానరానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు సి.బెళగల్ వాసులు. శనివారం ఈశ్వరాలయ ఆవరణంలో వానరం మృతి చెందిన విషయాన్ని స్థానికులు గమనించారు. స్థానిక బస్టాండ్ నుంచి తూర్పు ఆంజనేయస్వామి ఆలయం వరకు అంతిమయాత్రను నిర్వహించి ఆయల ప్రాంగణంలో ఖననం చేశారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ

కోడుమూరు: అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ మహబూబ్ దౌలత్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కోట్ల సర్కిల్లో నీటితో ప్రదర్శన చేసి, అగ్నిప్రమాద నివారణ కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయించాలి

సి.బెళగల్: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ సుమంత్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు సూచించారు. శనివారం ఆయన మండల హౌసింగ్ సిబ్బందితో కలిసి బురాన్‌దొడ్డి గ్రామంలోని జగనన్న కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ ఉపాధి పనులు

కల్లూరు/ఓర్వకల్లు: జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండలంలోని చెట్లమలాపురం, ఓర్వకల్లు మండలంలోని బైరాపురం, లొద్దిపల్లె గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం 6 గంటలకు పనులకు హాజరై 10 గంటల్లోపు పూర్తి చేసుకుని ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

రూ.2 లక్షల విరాళం

గూడూరు: పట్టణంలో బీరప్ప ఆలయం సమీపంలో నిర్మించ దలచిన వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి చిన్న రామన్న కుమారుడు చిన్న రాముడు రూ.2 లక్షలు విరాళం అందించారు. శనివారం ఆలయ నిర్వాహకులు, యాదవ సంఘం పెద్దలు దాతను సన్మానించారు.

నైపుణ్యాలు మెరుగు పరచుకోవాలి

కల్లూరు: యువత నైపుణ్యాలను మెరుగుపరచుకుని స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని సీడాప్ సీఈఓ ఎంకేవీ శ్రీనివాసులు సూచించారు. శనివారం బి.తాండ్రపాడు టీటీడీసీ సమావేశపు హాల్‌లో సీడాప్, డీఎస్‌డీఓ సిబ్బంది జాబ్ మేళాలు, స్కిల్స్ డెవలప్‌మెంట్, స్కిల్ హబ్స్, స్కిల్ ట్రైనింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కర్నూలు, నంద్యాల డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్లు వెంకటసుబ్బయ్య, బి.శ్రీధర్‌రెడ్డితో పాటు సీడాప్ సీఈఓ ఎంకేవీ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర మిషన్ మేనేజర్ విజయ్ కుమార్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, జాబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సిరిల్ కిరణ్ పాల్గొన్నారు.

ప్రజలకు పరిష్కారం చూపాలి

కర్నూలు (న్యూటౌన్): వివిధ సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు పరిష్కారం చూపాలని రూరల్ తహసీల్దార్ శివరాముడు వీఆర్‌ఓలను ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకుల సమావేశంలో మాట్లాడారు.

ఆధార్‌కార్డు అనుసంధానం పూర్తి చేయండి

కల్లూరు: ఓటరు కార్డును ఆధార్‌కార్డుకు అనుసంధానం చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహసీల్దార్ టీవీ రమేష్ బాబు అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ ప్రాంతాల బీఎల్‌ఓలు, వీఆర్వోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

ముగిసిన 'పది' పరీక్షలు

గడివేముల/సి.బెళగల్: పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్షకు పరీక్షకు గడివేముల జెడ్పీహైస్కూల్‌లో 285 మంది, ఏపీ మోడల్ స్కూల్‌లో 258 మంది పరీక్షలు రాశారు. సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్‌లో 286, కొత్తకోట జెడ్పీ హైస్కూల్ 345, ఏపీ మోడల్ స్కూల్‌లో 290, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 230 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

అధికారుల పర్యటన

సి.బెళగల్: పోలకల్ గ్రామంలో శనివారం ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్ గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణి పర్యటించారు. బీసీ కాలనీలో ఓపెన్ కుళాయిలను గమనించి బిరడాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండ పైపులైన్ల మరమ్మతులను చేపట్టాలని సర్పంచ్ మాదక్కకు సూచించారు. సచివాలయం – 1, 3లను తనిఖీ చేశారు. అలాగే సి.బెళగల్ బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ సిబ్బందికి, విద్యార్థులకు సూచించారు.

మెరుగైన సేవలు అందించాలి

కల్లూరు: గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజు నాయుడు సూచించారు. శనివారం కల్లూరు మండలం సల్కాపురం గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి, రికార్డులను, రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనుల గురించి పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

నీటి సమస్య తలెత్తనివ్వొద్దు

గూడూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయం, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ మాధవీలత సూచించారు. కె.నాగలాపురంలో తాగునీటి సరఫరాను శనివారం ఆమె పరిశీలించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సచివాలయాలకు ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షల నిధుల్లో కొంత మొత్తాన్ని తాగునీటి సమస్య పరిష్కారాకి వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

ఇంటింటా సంక్షేమ పథకాలు

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పట్టణంలోని చిన్న బోయవీధి, అద్దుగల వీధి, కుమ్మరివీధి, మెయిన్ బజార్‌లలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరగా తమ కాలనీలో భూమి పూజ ఇంతవరకు సీసీ రోడ్డు వేయలేదని కొందరు, జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తే పాత ఇంటి స్థానంలో కొత్త ఇళ్లు నిర్మించుకుంటామని మరికొందరు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎస్ఐ శ్రీనివాసులు, ఏఓ రవిప్రకాష్, ఏఈలు, గంగరాజు, ప్రసాద్, ఇష్మాయిల్, ఈఓఆర్డీ మంజుల, ఏపీఎం పుష్పావతి, ఈఓ అజయ్‌భాస్కర్, ఎర్రదొడ్డి సర్పంచు మధుసూదన్‌రెడ్డి, స్థానిక నాయకులు రాజశేఖరరెడ్డి, ప్రభాకర్, ప్రతాప్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, బలరాం, కొలుట్ల, మల్లేష్, అయ్యప్ప పాల్గొన్నారు.


లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డా.సుధాకర్

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని నందనపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వెంకాయపల్లె ఎల్లమ్మ, వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో చలివేంద్రం నిర్వాహకులు వలీశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, పాటిల్ హనుమంత్‌రెడ్డి, బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, సీతారామిరెడ్డి, శేషిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, రామ్‌నాథ్ రెడ్డి, బోయ వెంకటేశ్వర్లు, హనుమంతు, కోటీశ్వర్ రెడ్డి, శివారెడ్డి, మధుశేఖర్ పాల్గొన్నారు.


తాగునీరు సరఫరా చేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ..

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ పీరయ్య శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని యువతకు సూచించారు.

చేసిన మంచినే చెప్పండి

కర్నూలు (న్యూటౌన్): నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన మంచి పనులనే ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ సూచించారు. శనివారం స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్డు సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది, వలంటీర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నెల 17 నుంచి జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడాలన్నారు. గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించాలన్నారు. పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరాలన్నారు. చివరగా ప్రభుత్వంపై ప్రజల నుంచి స్పందనను అడిగి నోట్ చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ పాటిల్ హనుమంత్‌రెడ్డి, మున్సిపల్ డీఈ షాకీర్, కార్పొరేటర్ సాంబ, సచివాలయ కన్వీనర్లు భాస్కర్, పక్కీరన్న, మహేష్ గౌడు, ఖాజాబీ, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

రైతులను చైతన్యం చేయండి

పాణ్యం: భూసార పరీక్షలు చేయించుకునేలా రైతులను చైతన్యం చేయాలని నంద్యాల ఏడీఏ రాజశేఖర్ సిబ్బందికి సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన వ్యవసాయ అధికారులకు అవగాహన కల్పించారు. సమీపంలోని పొలంలోకి వెళ్లి మట్టి పరీక్షలు చేసే విధానాన్ని వివరించారు. మట్టి పరీక్షల ఫలితాలను బట్టి ఎరువులు, మందులు వాడితే భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చనే విషయాన్ని రైతులకు వివరించి పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. అంతరం ఉద్యానశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు సరళమ్మ, ఏఓ జయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

- **గడివేముల:** రైతుల భూముల్లో మట్టి నమూనాల సేకరణ ప్రారంభించామని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం గడివేములతో పాటు, కరిమద్దెల గ్రామ పొలాల్లో మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్షల ఆవశ్యకత, ప్రయోజనాలను రైతులకు వివరించారు. సేకరించిన మట్టి నమూనాలను నంద్యాలలోని భూసార పరీక్ష కేంద్రానికి తరలిస్తామన్నారు. ఫలితాలను ప్రత్యేక యాప్ ద్వారా రైతులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఏఏలు ప్రియదర్శిని, భావన, నాగార్జునరెడ్డి, విజయ్, రమేష్ పాల్గొన్నారు.


భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

- **కల్లూరు:** రైతులు వారి పొలాల్లో ఉన్న సూక్ష్మ, స్థూల పోషకాల గురించి తెలుసుకుని పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులురెడ్డి అన్నారు. శనివారం నేల ఆరోగ్యం, మట్టి పరీక్షలపై వీఏఏ, వీహెచ్‌ఏలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు నిర్మాణానికి మంత్రి హామీ

పాణ్యం: పాణ్యం–గోరుకల్లు రోడ్డు నిర్మాణానికి మంత్రి బుగ్గన్న రాజేంద్రనాథ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఓ ప్రైవేట్ కార్యక్రమం నిమిత్తం శనివారం కొణిదేడు గ్రామానికి వచ్చిన మంత్రిని పాణ్యం జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి కలిశారు. పాణ్యం–గోరుకల్లు గ్రామాల మధ్య 13 కిలో మీటర్ల దూరం ఉందని, భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని మంత్రికి వివరించారు. స్పందించిన మంత్రి అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపితే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


మంత్రి బుగ్గనకు సమస్యను వివరిస్తున్న సరళమ్మ, సూర్యనారాయణరెడ్డి


ప్రశాంతంగా ప్రారంభ రథోత్సవం

గూడూరు: పట్టణంలో జరుగుతున్న తిమ్మగురుడు స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం ప్రశాంతగా ప్రారంభ రథోత్సవం కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథంపై కూర్చోబెట్టారు. అనంతరం మేళతాళాలు, భాజాభజంత్రీల మధ్య రథాన్ని కదిలించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ఆదివారం సంపూర్ణ రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈఓ గురురెడ్డి తెలిపారు.


భక్తుల మధ్య సాగుతున్న ప్రారంభ రథోత్సవం

వందశాతం రాయితీపై సూక్ష్మపోషకాలు

సి.బెళగల్: జింక్, జిప్సం తదితర సూక్ష్మపోషకాలను వందశాతం రాయితీపై రైతులకు అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతు భరోసా కరదీపికల సంచికను రైతులకు అందజేశారు.


రైతుభరోసా కరదీపికను ఆవిష్కరిస్తున్న ఏఓ